
వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 80
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
డిసెంబర్ 12, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## మహిళా మణిహారం
# మాటేటి నీరజ

- భిన్న వ్యక్తిత్వాల రూపం
- చక్కని చిరునవ్వుతో పలకరింపు
- చూడగానే ఆకట్టుకునే వ్యవహార శైలి

7లో..

# గుప్త నిధుల కలకలం





- రాయపర్తి మండలం సన్నూరులో తవ్వకాలు
- ప్రసిద్ధ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి కూతవేటు దూరంలోనే ఘటన
- స్థానికుల సహకారంతోనే అంటున్న గ్రామస్తులు
- గతంలోనూ తెగబడిన దుండగులు
- ఆందోళనలో స్థానికులు

రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావాలన్న అత్యాశ.. నిధి దొరుకుతుందన్న మూఢత్వం గుప్త నిధుల అన్వేషణకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలోనే గత కొంత కాలంగా చరిత్ర ప్రసిద్ధి గాంచిన ఆలయాలు, కట్టడాలు ఉన్న ప్రాంతాల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గుట్టు చప్పడు కాకుండా తవ్వకాలు జరుపుతున్నారు. బుధవారం రాత్రి కూడా కొంతమంది దుండగులు రాయపర్తి మండలం వేంకటేశ్వర పల్లి గ్రామంలో గుప్త నిధులకోసం తవ్వకాలకు తెగబడ్డారు. కాకతీయుల కాలంలో నిర్మించిన సుప్రసిద్ధ స్వయంభూ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి కేవలం 400 మీటర్ల దూరంలోనే ఈ తవ్వకాలు జరుగడం గమనార్హం. గ్రామంలోని ఓ రైతుకు చెందిన భూమిలో గుప్త నిధుల తవ్వకాలు జరిగినట్లు అక్కడున్న పరిస్థితులను బట్టి తెలుస్తోంది. సుమారు ఎనిమిది అడుగుల గొయ్యి తవ్వి గుప్త నిధులకోసం ప్రత్యేక పూజలు చేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. అయితే ఇది ఇంటి దొంగల సహకారంతోనే జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. గుప్త నిధుల తవ్వకాలకోసం వచ్చిన వారికి స్థానికంగా ఉండే వారు తమవంతు సహాయ సహకారాలు అందించి ఉంటారని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా గత కొంత కాలంగా సాగుతున్న గుప్త నిధుల తవ్వకాలకు చరమగీతం పాడేలా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

\- వరంగల్ వాయిస్, తొర్రూరు

వివరాలు 2లో..



2లో..

## 14న గురుకులాల్లో ప్రత్యేక కార్యక్రమం

- అదే రోజునుంచి డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు అమలు
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



8లో..

## ర్యాగింగ్ ను నిర్మూలించాలి

విద్యార్థుల డ్రాప్ ఔట్ తగ్గించాలి | జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




## 14న మెగా లోక్ అదాలత్

- వరంగల్ పోలీస్ కమిషనర్ కిషోర్ ఝా






# గుప్త నిధుల కలకలం

- రాయపర్తి మండలం సన్నూరులో తవ్వకాలు
- ప్రసిద్ధ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి కూతవేటు దూరంలోనే ఘటన
- స్థానికుల సహకారంతోనే అంటున్న గ్రామస్తులు
- గతంలోనూ తెగబడిన దుండగులు
- ఆందోళనలో స్థానికులు

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుండం గ్రామ శివారులో గుప్త నిధుల కోసం ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు నిర్వహించారు. గుండం ప్రాంతంలో కాకతీయులు నిర్మించిన శివాలయం ఉండడంతో నిధులున్నట్లు భావించి తవ్వకాలు జరిపినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ సంఘటన మరువక ముందే బుధవారం రాత్రి రాయపర్తి మండలం వేంకటేశ్వర పల్లి గ్రామంలో గుప్త నిధుల కోసం దుండగులు తవ్వకాలకు తెగబడ్డారు. ఈ తవ్వకాలు జరిపిన ప్రాంతానికి సుమారు 400మీటర్ల దూరంలోనే కాకతీయుల కాలంలో నిర్మించిన సుప్రసిద్ధ స్వయంభూ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఉండడం గమనార్హం. గ్రామంలోని ఓ రైతుకు చెందిన ప్రైవేట్ భూమిలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. నిధుల కోసం సుమారు ఎనిమిది అడుగుల లోతు ఉన్న గుంత తవ్వారు. ఆ గుంత చుట్టూ నిమ్మకాయలను వరుసగా పేర్చారు. అలాగే గుంతలో భారీగా పసుపు, కుంకుమ చల్లడంతో ఆ ప్రాంతమంతా భయానకంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఆ గుంతలో గుమ్మడి కాయ, కొబ్బరి కాయలు కొట్టిన ఆనవాళ్లు ఉన్నాయి.



### తెలిసిన వారి సహకారంతోనే..

సన్నూరులో జరిగిన గుప్త నిధులు తవ్వకాల్లో స్థానికులు సహకారం ఉండి ఉంటుందని భావిస్తున్నారు. ఇక్కడి స్థితి గతులు తెలిసిన వారి సహకారం లేకుండా ఇంత పెద్ద ఎత్తున గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపి ఉండరని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ భూమిలో ఎనిమిది ఫీట్ల లోతు గుంత తవ్వడాన్ని బట్టి చూస్తే వీరు ఒక పథకం ప్రకారమే చేసిట్లు భావిస్తున్నారు. ప్రొక్లేనర్ సహాయంతోనే గుంత తవ్వి ఉంటారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆ గుంతలో ఉన్న పెద్ద బండరాయిని శబ్ధం రాకుండా ఎలా పగలగొట్టారన్నది కూడా అర్థంకాని ప్రశ్నగా మిగిలిపోయింది. అయితే తవ్విన గుంత చుట్టూ వాటర్ బాటిళ్లు, అగరవత్తులు, కర్పూరపు బిళ్ళలు, బీడి కట్టలు ఉండడం చూస్తే ఎంత దర్జాగా తవ్వకాలు చేపట్టారో అర్థమవుతోంది.

### గతంలో ఇక్కడే ఊరు..

గతంలో ఇక్కడ సన్నూరు పూర్వ గ్రామం ఉండేదని స్థానికులు వెల్లడించారు. అందుకే ఇక్కడ అప్పుడప్పుడు పురాతన ఆనవాళ్లు, పాత పనిముట్లు లభ్యమౌవుతున్నాయని పలువురు ప్రజలు తెలిపారు. అయితే తాము బుధవారం సాయంత్రం వరకు పంటపొలాల వద్దే ఉన్నామని సమీప పొలాల రైతులు వెల్లడించారు. తాము ఇంటికి వెళ్లిన తర్వాతే దుండగులు తవ్వకాలకు పూనుకుని ఉంటారన్నారు. గతంలో కూడా తవ్వకాలు చేపట్టారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి మరోమారు గుప్త నిధుల తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





# 14న గురుకులాల్లో ప్రత్యేక కార్యక్రమం

- అదే రోజునుంచి డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు అమలు
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లాలోని అన్ని గురుకుల హాస్టళ్లలో ఈనెల 14వ తేదీన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గురుకుల హాస్టల్ విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వం గురుకుల హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలను పెంచిందన్నారు. అదేవిధంగా 16 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచిందని పేర్కొన్నారు. గురుకుల విద్యార్థుల కోసం పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గురుకుల హాస్టల్ విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తుందన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి అమలయ్యే నూతన డైట్, కాస్మోటిక్ చార్జీల పై జిల్లాలోని ప్రతి గురుకుల హాస్టల్ లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, జోనల్, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. సంబంధిత గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు. పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీల వివరాలను తెలిపేలా బ్యానర్లను ప్రతి గురుకుల హాస్టల్ లో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గురుకుల విద్యాసంస్థ పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టిక ఆహారాన్ని తప్పనిసరిగా అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, డీఈవో వాసంతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇంటికి టోల్ ఫ్రీ నెంబర్..

ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి సందేహాలు నివృత్తి చేసేందుకు, ఫిర్యాదుల స్వీకరణకు సంబంధించిన వివరాల కోసం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో టోల్ ఫ్రీ నెంబర్ 1800425115 ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ అన్ని పని దినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఈ టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. ఇందుకుగాను టుబీహెచ్ కే జిల్లా నోడల్ అధికారులుగా శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ రమాదేవిని నియమించినట్లు వెల్లడించారు.

# బీసీ బహుజన సంక్షేమ సంఘం.. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కటకం విజయకుమార్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తవాడ ప్రాంతానికి చెందిన కటకం విజయకుమార్ పద్మశాలిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు ప్రతాపగిరి విజయ్ కుమార్ తెలిపారు. బీసీలకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా చేస్తున్న పోరాటాలలో భాగంగా చురుకుగా తమ కుల సంఘంతోపాటు బీసీ కుల సంఘాలలో ఉన్న వారిని కులాలకు అతీతంగా చైతన్య పరుస్తూ హక్కుల సాధన కొరకు తన వంతు కృషి చేస్తున్న కటకం విజయ్ కుమార్ ను గుర్తించి ఈ అవకాశం ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కటకం విజయకుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో రాష్ట్ర పదవి ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రతాపగిరి విజయ్ కుమార్, తెలంగాణ కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆకారపు మోహన్తోపాటు వివిధ కుల సంఘాల అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్, పల్లపు సమ్మయ్య, నూతనకంటి ఆనందం, ఎర్రోజు బిక్షపతి, గంబీకార్ అశోక్, జోర్రీగల శ్రీనివాస్, రాసమళ్ళ బాలకృష్ణ, తిపిరిశెట్టి శ్రీనివాస్, జిడ్డి కనకయ్య, ఆరె రాములు, ఖమ్మంపాటి వెంకటేశ్వర్లు, కాజిపేట వెంకటరామ్ నర్సయ్య, మేకల కేదారి యాదవ్, బయ్యస్వామి, ప్రతాపగిరి బిక్షపతి, బర్కం రామ్మోహన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతిభా పరీక్షలు అభ్యసన సామర్థ్యాలను వెలికి తీస్తాయి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ గణిత ఫోరం హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో గణిత ప్రతిభా పరీక్షలు జిల్లా సైన్స్ సెంటర్ లో నిర్వహించారు. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిభా పరీక్షకు జిల్లాలోని వివిధ మండలాల్లో ఇంతకుముందే మండల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు హాజరయ్యారు. తెలుగు, ఆంగ్ల మధ్యమాల్లో, గురుకులాల వారీగా ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ ప్రతిభ పరీక్షల్లో ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో గురుకులాల్లో మొదటిస్థానం పొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పరీక్షల తేదీలను ప్రకటించారు. ఈ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటో నగదు బహుమతి మెడల్ తో పాటు నిఘంటువులు, సర్టిఫికెట్ అందజేశారు. తెలంగాణ గణిత ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తౌటం భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొని విజేతలకు బహుమతులు మెడల్స్ అందజేశారు. రిటైర్డ్ డైట్ లెక్చరర్ సోమయ్య, తెలంగాణ గణిత ఫోరం ప్రధాన కార్యదర్శి బోయినపల్లి మహేష్ కుమార్, కోశాధికారి పుల్లూరు మల్లికార్జున్, రాష్ట్ర బాధ్యులు కందగట్ల సురేష్, కంది శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి నెహ్రు, గోరి కొత్తపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, స్వామి, దేవునూరి ఆనంద్, బింగి కృష్ణమూర్తి, దహగం రమేష్, మిగతా మండలాల నుండి వచ్చిన గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విజేతలు వీరే..

ఆంగ్ల మాధ్యమం నుంచి పి.శివ ప్రియా ఫాతిమా స్కూల్, అనూష జడ్పీఎస్ఎస్ పెద్ద పెండ్యాల, యు.కళ్యాణి బేగం, జడ్పీహెచ్ఎస్ పీచర నుంచి సెలెక్టయ్యారు. తెలుగు మాధ్యమం నుంచి టి.నవదీప్ జడ్పీహెచ్ఎస్ భీమదేవరపల్లి, ఎం.అన్వేష్ జడ్పీహెచ్ఎస్ సూరారం, గణేష్ జడ్పీహెచ్ఎస్ వెల్లంపల్లి నుంచి ఎంపికయ్యారు. గురుకులాల నుంచి వి.వైష్ణవి, టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ హాసన్ పర్తి, సాత్విక పీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ పెంబర్తి, ఎంజేపీడబ్ల్యూఎస్ శాయంపేట నుండి సెలెక్టయ్యారు.

# కురుమలు పెద్ద సంఖ్యలో తరలి రావాలి




**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** హైద్రాబాద్ లోని కోకాపేటలో తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ సంఘం నూతన భవనాన్ని ఈ నెల 14న ప్రారంభిస్తున్న సందర్భంగా ఈ ప్రారంభ కార్యక్రమానికి జిల్లా, మండలం, గ్రామ వ్యాప్తంగా ఉన్న కురుమలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కురుమ సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలోని కురుమ సంఘ భవనంలో బుధవారం కురుమ సంఘం జనగామ జిల్లా నాయకులు పేర్ని రవి కురుమ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దొడ్డి కొమురయ్య కురుమలు ఆత్మ గౌరవ భవన ప్రారంభ కరపత్రాలను ఆవిష్కరించారు. కురుమలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయవలసిందిగా కోరడం జరిగింది. ఈ సమావేశంలో కురుమ సంఘం జిల్లా నాయకులు గొరిగే రవి, దేవర యాకన్న, మాల యాకన్న,గొరిగి భాస్కర్, బర్మా సత్తయ్య, చేవెల్లి వెంకన్న, కామెడీ రాజు, గవ్వల భరత్, మరాటి శ్రీను, కామెడీ భిక్షపతి, బడితే శ్రీనివాస్, బడితే బీరయ్య, దేవర మల్లయ్య, దేవర మహేందర్, పేర్ని మల్లయ్య, పేర్ని అనిల్, పేర్ని బక్కయ్య, పేర్ని జయవర్ధన్, బడితే ఆంజనేయులు, దేవర శ్రీశైలం, పేర్ని బీరయ్య, పేర్ని వీర మల్లయ్య, కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సీపీ ఆదేశాల మేరకు హనుమకొండలోని కాకతీయ గవర్నమెంట్ కాలేజీలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు సేఫ్టీ(సీఆర్ఎస్ బీ) ఇన్ స్పెక్టర్ బి.శ్రీనివాస రావు రోడ్డు ట్రాఫిక్ నియమాల గురించి, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్ల జరిగే అనర్ధాల గురించి క్లుప్తంగా వివరించారు. ఇంకా వరంగల్ కమిషనరేట్ లో ప్రతి నెలా జరిగే రోడ్డు ప్రమాదాలు, అవి జరగడానికి గల కారణాలు, అవి జరగకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి అందరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్ ఎవరూ చేయకూడదన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ డ్రైవింగ్ లైసెన్స్ కొరకు అప్లై చేసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణలో యువత భాధ్యత చాలా ముఖ్యమని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ ఇన్ స్పెక్టర్ బి.శ్రీనివాస రావు, సిబ్బంది ఆర్ఎస్ఐ నవీన్ కుమార్, ఏఎస్ఐ వేణుగోపాల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి,100 మంది విద్యార్థులు, కళాశాల టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

# రాజీయే రాజమార్గం



- 14న జాతీయ మెగాలోక్ అదాలత్
- కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాజీయే రాజమార్గంమని, ఈ నెల 14న జాతీయ మెగాలోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 14న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్ మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుంది. కాబట్టి, ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

# యోగా గురువు శ్రీనివాస్ కు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గీతా జయంతి సందర్భంగా శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ స్కూల్లో ఏర్పాటు చేసిన భగవద్గీత శ్లోకాల పోటీలను పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో ప్రముఖ యోగ గురువు పోశాల.శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భగవద్గీత ప్రపంచ మానవాళి అనుసరించినట్లయితే మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుందని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చునని తెలియజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు భగవద్గీత శ్లోకాలను నేర్పించడం ద్వారా ఉన్నతంగా ఎదుగుతారని, నవ సమాజ నిర్మాణానికి అది దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఎంఆర్ స్కూల్ చైర్మన్ ముక్తేశ్వర్, నాగిళ్ల వేణుశర్మ, తండ అశోక్, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి కృషి చేయండి



**వరంగల్ వాయిస్, నడికూడ :** కంఠాత్మకూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో రూ.85,000 విలువైన మార్బుల్స్ వేయించాలని కోరుతూ గ్రామ గౌడ సంఘం కమిటీ వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని గురువారం హనుమకొండలోని ఆయన గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు భద్రయ్య, ధనుంజయ్, ఏ.రమేశ్, ఎస్.శ్రీనివాస్, మొగిలి, వెంకటేశ, తిరుపతి, జే.రాజు, జి. రాములు, వి.కృష్ణ మూర్తి, బి.రమేష్, రాజేందర్, వెంకటేష్, ప్రకాష్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# నరేందర్ కు భారత్ సేవా రత్న అవార్డు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని కొత్తవాడకు చెందిన ప్రముఖ వైద్యుడు కటకం నరేందర్ భారత్ సేవా రత్న జాతీయ అవార్డును అందుకున్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ అండ్ సోషల్ జస్టిస్ చైర్మన్ గాజుల శ్రీనివాసరావు ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. గత పుష్కర కాలంగా అందిస్తున్న వైద్య సేవలను గుర్తించి ఈ అవార్డును ఇవ్వడంపై డాక్టర్ నరేందర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఆర్ సీఎస్ జే జిల్లా అధ్యక్షుడు పోరండ్ల శంకర్, జిల్లా సమన్వయకర్త ఉరుగొండ రమేష్, సంస్థ బాధ్యులు కూచన వేణు, కందగట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# యాసంగికి 1350 ఎకరాలు తైబంది

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో యాసంగి పంటకు కాకతీయు కాకతీయుల గడప సముద్రం పెద్ద చెరువు ఆయకట్టులో యాసంగి సాగుకు 1350 ఎకరాల ఆయకట్టు రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. చెరువుకు ఐదు కాలువలకు తైబందిని నిర్ణయించారు. ఊటు కాలువకు 200 ఎకరాలు, కోట కాలువకు 200 ఎకరాలు, మత్తడి కాల్వకు 550 ఎకరాలు, కొత్త కాలువకు 200 ఎకరాలు, చుట్టు కాల్వకు 200 ఎకరాలు సాగు చేయాలని సమావేశంలో అధికారులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఐబీఈఈ బసవ ప్రసాద్ గౌడ్, ఐబీ ఏఈలు మహేందర్, సమరావు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, డిసెంబర్ 12, 2024

# ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం

## ➲ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ తప్పకుండా నెరవేరుస్తామని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. గురువారం నడికూడ మండలం రాయపర్తి గ్రామంలో అంగన్వాడీ సెంటర్ కు పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఫ్లెక్సీల రూపంలో గ్రామాలలో ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్థిక సర్దుబాటు చేసుకుంటూ అంచెలంచలుగా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 ఉచిత కరెంట్, 500 రూ వంట గ్యాస్, రెండు లక్షల లోపు రైతులు మాఫీ, ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు తదితర అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ తల్లి రూపకల్పనలో మన సాంప్రదాయాలు, సంస్కృతులు చారిత్రక నేపథ్యాలను పరిగణలోకి తీసుకొని ఒక నిండైన రూపాన్ని తీర్చిదిద్దామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మొట్టమొదటిసారిగా అసెంబ్లీలో పెట్టి ప్రజలకు వివరించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో ఏడు లక్షల కోట్ల అప్పు ఉన్నదన్న సంగతి ఏ సందర్భంలో కూడా తెలియజేయ లేదన్నారు. ఏకకాలంలో 2 లక్షల లోపు రైతు రుణ మాఫీ చేశామన్నారు. పంట బోనస్ 500/- ప్రకటనతో పెరిగిన సన్నాలు సాగు పెరిగిందని,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రైతు కుటుంబాలు ఆనందంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె. నారాయణ, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో శ్రీనివాస్, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ కొడపాక సుమలత కరుణాకర్, రాయపర్తి మాజీ ఎంపీటీసీ పర్నెం శ్రీలత మల్లారెడ్డి, మాజీ సర్పంచులు పర్నెం తిరుపతిరెడ్డి, కొయ్యడ నాగరాజు, కడారి సమ్మయ్య, ఆకినపల్లి లింగయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మారెం దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా గీతా జయంతి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాశిబుగ్గలోని బిట్స్ అశ్మక ఉన్నత పాఠశాలలో బుధవారం గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ వనజ హాజరై భగవద్గీత హిందువుల పవిత్ర గ్రంథమన్నారు. గీతా జయంతి అంటే భగవద్గీత పుట్టినరోజు అని, శ్రీకృష్ణుడు అర్జునుడికి కురుక్షేత్రంలో కర్తవ్య నిర్వహణ ఎట్లా చేయాలో తెలియనప్పుడు అనుగ్రహించిన మహోపదేశం అని దీనిని మార్గశిర శుద్ధ ఏకాదశి రోజున అందించాడని అందుకే ఆ రోజున ప్రపంచవ్యాప్తంగా గీతా జయంతిని జరుపుకుంటారని తెలిపారు. మానవజాతికి దివ్య మార్గాన్ని చూపే పవిత్ర గ్రంథం భగవద్గీత అని భగవద్గీత విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని విగ్రహానికి భగవద్గీతను పూలమాలతో అలంకరించారు విద్యార్థులు భవద్గీత శ్లోకాలు విష్ణు సహస్రనామాలు పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# 150 పోలింగ్ స్టేషన్ల నమోదు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో 150ని పోలింగ్ స్టేషన్లలో నమోదైనట్లు ఎంపీడీవో ఎల్ భాస్కర్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు అన్ని పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎవరో మాట్లాడుతూ మండలంలో 17 గ్రామ పంచాయతీలకు గాను వాటి నిర్వహణకు 108 వార్డులకు 155 పోలింగ్ స్టేషన్లలో సంబంధిత గ్రామ పంచాయతీలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదరు పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటుకు అన్ని పార్టీల నాయకులు పరిశీలన అనంతరం ఏర్పాటు చేశామన్నారు. దీంతో ఎన్నికలకు ఆమోదం తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నుంచి ఏ కుమార్, ఏం మల్లికార్జున్, ఓ కృష్ణ, బీజేపీ నుంచి ప్రవీణ్ రావు, మొగిలి, బీఆర్ఎస్ నుంచి కరుణాకర్ రెడ్డి, బి.శంకర్, ధర్మ సమాజ్ పార్టీ నుంచి జితేందర్, విక్రమ్ పాల్గొన్నారు.

# చిన్న పిల్లల పెద్ద సందేశం

## ప్రమాదంలో ఉన్నవారికి సహాయపడండి





**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై తోటి మనుషులు క్షతగాత్రులకు సహాయ పడకుండా, మానవత్వం మరిచి కనీసం అంబులెన్స్ కు సమాచారం అందించకుండా సెల్ఫీలు దిగడంపై యువకులకు కనువిప్పు కలిగేలా చిన్నారులు చేసిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ ఆధ్వర్యంలో రూపొందించిన వీడియో, ప్రస్తుతం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న సందర్భంలో ప్రమాదాలు జరుగుతున్నప్పుడు తలకు దెబ్బలు తగలడం, కోమాలోకి వెళ్లి మరణించడం నిత్యం ఏదో ఒక చోట జరుగుతుంది. ప్రమాదాలు జరిగినప్పుడు ఈ రోజుల్లో కనీసం 108 సమాచారం ఇవ్వకుండా ఫోన్లతో సెల్ఫీలు దిగుతూ వీడియోలు తీసుకుంటూ వాట్సాప్ లో పోస్ట్ చేస్తూ పట్టించుకోకుండా ఉన్నారంటూ తీసిన వీడియో ఇప్పుడు అందరిని ఆలోచింపజేసే విధంగా ఉంది. హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి అంటూ చేసిన వీడియో అందర్నీ ఆకట్టుకుంది. విద్యార్థులకు చిన్నతనం నుండే ఇలాంటి ప్రమాదాలపై అవగాహన కలిగిస్తున్న ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ ను పలువురు నెటిజన్లు అభినందిస్తున్నారు.

# ముగిసిన మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు



**వరంగల్ వాయస్, ఎల్కతుర్తి :** సీఎం కప్ క్రీడా పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి మండలానికి పేరు తీసుకోవాలని ఎల్కతుర్తి ఎంపీడీవో ఎన్.విజయకుమార్ తెలిపారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కార్మెల్ స్కూల్లో మూడు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా మండల స్థాయిలో 20 క్రీడాంశంల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల 17 నుంచి హనుమకొండలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఎంఈఓ సీహెచ్.సత్యనారాయణ మాట్లాడుతూ గత మూడు రోజులుగా పండుగ వాతావరణంలో మండల స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అబ్జర్వర్ పి.వెంకట్, కార్మెల్ పాఠశాల ప్రిన్సిపల్ లేజిల్, పీడీలు, పీఈటీలు తాళ్లపల్లి రాముడు, భోగి సుధాకర్, జి.ప్రేమ్ ప్రసాద్, ధనలక్ష్మి, దివ్య, ఉషారాణి, కిరణ్ రావు, శ్రీకాంత్, తిరుపతి పాల్గొన్నారు.

# పరకాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తేవాలి

## ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడలు ఈ నెల 9న గ్రామ పంచాయతీలలో క్రీడలు నిర్వహించి గెలుపొందిన వారికి మండల స్థాయిలో నిర్వహించి విజేతలను జిల్లా స్థాయికి పంపారు. అలాగే వారికి సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ యువత ఎంతో మంది వివిధ క్రీడలలో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించడానికి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సీఎం కప్ క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి యస్ రమాదేవి, నోడల్ అధికారి నామాని సాంబయ్య, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మధు, సురేందర్ ఎస్.జీ.ఎఫ్ సెక్రటరీ సంధి కరిత, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

# అధికారులు తీరు మార్చుకోవాలి

## ● కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** డివిజన్ లో అభివృద్ధి పనులు 'మౌలిక సదుపాయాలు కల్పించడంలో కొందరు అధికారుల పనితీరుతో ప్రజల నుంచి విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. పారిశుద్ధ పనులలో కార్మికులు ఉన్న వాహనాలు సరిపడ లేవని, చెత్తా ట్రాక్టర్ లేక 20 రోజులు గడుస్తుందన్నారు. రెండు స్వచ్ఛ ఆటోలు పనిచేయక ఐదు నెలలు గడుస్తున్న ఆ స్థానంలో నూతన వాహనాలు సమకూర్చలేదని ఆరోపించారు. కచ్చా కాలువలు పేరుకుపోయి రోడ్డుపై నీరు ప్రవహిస్తున్నందున ప్రజలు నడవలేక పోతున్నారని అన్నారు. జేసీబీ అవసరమని సీఎంహెచ్ఓ, ఎంహెచ్ఓ సూపర్ వైజర్ శానిటరీ ఇన్ స్పెక్టర్లకు చెప్పి పది రోజులు కావస్తున్న డివిజన్ కు పంపడం లేదని ఆరోపించారు. ఆరు నెలల నుంచి స్తంభాలకు కొన్ని లైట్లు వెలగడం లేదని, నూతనంగా స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేయాలని ఎన్నో మార్లు చెప్పిన రిపేర్లు లేవు, కొత్తవి లేవన్నారు. చెట్లోళ్లగడ్డ వద్ద పైప్ లైన్ లీకేజీ వేల లీటర్లు నీరు వృధా అవుతుందని సంబంధిత అధికారులకు తెలియపరిచినా ఇంతవరకు లీకేజీలు అరికట్టలేదన్నారు. దీని వల్ల కాలువ నుండి ఇండ్లలోకి నీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఒక్క అధికారి కూడా కనీసం డివిజన్ లో పర్యటించిన పాపాన పోలేదన్నారు. ఈ విధంగా ఉంటే డివిజన్ ఏ విధంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అధికారుల తీరుపై ప్రశ్నించారు. పాలన విధానం ఏ విధంగా నడుస్తుందో ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, అధికారుల విధానాలు మారకుంటే త్వరలోనే ప్రజల మద్దతు కార్యాచరణ ప్రకటిస్తానని కార్పొరేటర్ మరుపల్ల రవిహెచ్చరించారు.

# సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి


## ● జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 40 శాతం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఈనెల 14న జిల్లాలోని (125) విద్యా సంస్థలలో పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని, అందుకు అనుగుణంగా విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపాలని, విద్యాసంస్థ ఆవరణలో శానిటేషన్ చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, నాణ్యమైన ఆహార పదార్థాలతో రుచికరమైన భోజనం సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పిల్లలకు నాణ్యమైన ఆహారం అందిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనలు అందించుటకు కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే



జిల్లాలో ప్రతి హాస్టల్ కు ఒక అధికారిని నియమించి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రణాళిక ప్రకారం విద్యార్థుల స్థితిగతులను తెలుసుకుంటూ అందిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేస్తూ ఉన్నామని తెలిపారు. జిల్లాలో పక్కా ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో, (రెవెన్యూ) కె.వీర బ్రహ్మచారి, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సైదా నాయక్, సీపీఓ సుబ్బారావు, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, డీపీఓ హరిప్రసాద్, అన్ని మండలాల నుంచి వచ్చిన ప్రిన్సిపాల్స్, వార్డెన్లు, ఎంపీఓలు, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు మెంబర్ గా చంద్రప్రకాష్



వరంగల్ వాయిస్, శాయంపేట : శాయంపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్ ను తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ మెంబర్ గా నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్ర ప్రకాష్ 1982లో కాంగ్రెస్ పార్టీలో చేరి, అహర్నిశలు పార్టీ కోసం శ్రమిస్తూ అంచలంచెలుగా ఎదిగారు. 1992లో పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ గా, 1995లో శాయంపేట గ్రామ సర్పంచిగా, 2001లో ఎంపీపీగా, శాయంపేట చేనేత సొసైటీ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టారు. తన భార్య రమాదేవిని ఎంపీపీగా చేశారు. 2018లో చంద్ర ప్రకాష్ ఎంపీటీసీగా గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ మెంబర్ గా ఎంపిక కాబడ్డారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, చైర్మన్ జనక్ ప్రసాద్ లకు బాసాని చంద్రప్రకాష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# పరకాల ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షురాలిగా డాక్టర్ రజిని రుద్రమ



**వరంగల్ వాయిస్, పరకాల :** ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డాక్టర్ రజిని రుద్రమ అన్నారు. ఆర్టీసీ పరకాల డిపో బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షురాలిగా డాక్టర్ రజిని రుద్రమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పరకాల డిపో బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ తెలిపారు. పరకాల పట్టణంలోని గౌడ సంఘం భవనంలో ఆర్టీసీ పరకాల డిపో బీసీ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సెక్రటరీ శ్రీలత, గ్యారేజ్ సెక్రటరీ అనిల్ కుమార్, చీఫ్ అడ్వైజర్ బాబురావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాత్రి దుర్గయ్య, వరంగల్ రీజినల్ ఎం సాంబయ్య, డిపో ప్రచార కార్యదర్శి వి.వై స్వామి, తదితరుల ఆమోదంతో పరకాల డిపో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షురాలిగా డాక్టర్ రజిని రుద్రమను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆమెను ఉద్యోగ సంఘ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిని రుద్రమ మాట్లాడుతూ ఆర్టీసీలో బీసీ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్తూ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో గౌరవ అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించినందుకు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అంబులెన్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి




**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల ప్రజల సౌకర్యార్థం 108 అత్యవసర సేవలను గురువారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. అత్యవసర సమయంలో 108 వాహనం సేవలు వినియోగించుకొని ప్రజలు ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. త్వరలో మండల ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన ప్రకారం ప్రజలకు ప్రాథమిక వైద్యం, విద్య అందించాలనేదే సంకల్పమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున 108 సేవలను ప్రారంభించడం గొప్ప విషయమని, ప్రజలకు సేవలు అందించడంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ప్రాముఖ్యత ఉందని, వారి పట్ల కృతజ్ఞతగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ త్వరలో నడికూడ మండలంలో పీహెచ్ సీ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లలితా దేవి, ఆర్డీఓ నారాయణ, పీహెచ్ సీ రాయపర్తి వైద్యాధికారులు డాక్టర్ స్వాతి, దివ్య, అనూహ్య, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో శ్రీనివాస్, 108 ప్రాజెక్టు మేనేజర్ శివకుమార్, లక్ష్మణ్, హనుమకొండ జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, సీహెచ్ఓ సుజాత, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

# సోమనాథుడికి ఝాన్సీ రాజేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పాలకుర్తి పట్టణంలోని స్వయంభు శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలోని సోమనాథుడికి, వేద పండితుల మంత్ర ఉచ్ఛరణల మధ్య పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి భక్తి శ్రద్ధలతో అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలోకి విచ్చేస్తున్న ఝాన్సీ రాజేందర్ రెడ్డికి పండితులు పూర్ణ కుంభలతో, స్థానిక, ప్రజలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ సోమనాథుడిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేవుడు నియోజకవర్గ ప్రజలకు మరింత రెట్టించిన ఉత్సాహంతో సేవచేసే శక్తి సామర్థ్యాలను ప్రసాదించాలని, నియోజకవర్గ ప్రజలకు పాడి పంటలు సమృద్ధిగా పండి సుఖ శాంతులతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఝాన్సీ రెడ్డి వెంట ముఖ్య నాయకులు రాపాక సత్యనారాయణ, ఆలయ అర్చకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ లేబర్ కమిషనర్ వినీతకు సత్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నూతనంగా వచ్చిన హనుమకొండ జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ ను బీఎన్ఆర్కేఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హనుమకొండ జిల్లా డీసీఎల్ డిప్యూటీ లేబర్ కమిషనర్ బదిలీపైన నూతనంగా వచ్చిన సందర్భంగా గురువారం బీఎన్ఆర్కేఎస్ (భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం) పంకెర్ల కుమారస్వామి యాదవ్, రాష్ట్ర కార్యదర్శి, హనుమకొండ జిల్లా, ఇంఛార్జి, మరియు, మూలవీర నర్సింహులు హనుమకొండ జిల్లా అధ్యక్షులు, అట్లాగే, గూడ వీరస్వామి, హనుమకొండ జిల్లా కార్యదర్శి, వారు మర్యాద పూర్వకంగా కలిసి ఆఫీసర్ వినీతను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా పెద్ది వెంకట నారాయణ గౌడ్ జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ పుట్టిన రోజు వేడుకలు గురువారం స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ కాన్ఫరెన్స్ హాల్ లో రెడ్ క్రాస్ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ముందుగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పుష్పగుచ్చం అందచేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం రెడ్ క్రాస్ సిబ్బంది పుష్పగుచ్చం అందచేసి, శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ రైస్ మిల్లు యాజమానిగా ఉంటూ తన భార్య పేరు మీద స్వచ్ఛంద సంస్థ స్థాపించి మహిళలకు కుట్టు మిషన్లు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు, బెంచీలు, ఆట వస్తువులు ఉచితంగా అందచేస్తూ సేవ చేసే కార్యక్రమాలలో ముందుంటారని అన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ రెడ్ క్రాస్ టైలర్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు




సర్టిఫికెట్లు అందజేశారు. అదే విదంగా శిక్షణ పూర్తిచేసుకున్న మహిళల సమక్షంలో డ్రా పద్ధతి ద్వారా ముగ్గురికి రెడ్ క్రాస్ చైర్మన్, పాలకవర్గం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణు గోపాల్, చెన్నమనేని జయశ్రీ, టైలర్ ట్రైనర్ విజయ, రెడ్ క్రాస్ సిబ్బంది, టైలర్ నేర్చుకుంటున్న మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారంపై ఆశలు..

- ఇందిరమ్మ ఇండ్ల కోసం 'యాప్' సిద్ధం
- మొబైల్ యాప్ లో దరఖాస్తుదారుల వివరాల నమోదు




**వరంగల్ వాయిస్, దామెర :** సొంతింటి కల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరు పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుకు శరవేగంగా కసరత్తు సాగుతోంది. ఇప్పటికే ప్రజాపాలన దరఖాస్తులను వడపోసిన అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో అసలైన లబ్దిదారులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి యాప్ ద్వారా సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండలంలో ఇండ్ల లబ్దిదారుల ఎంపిక కోసం చేపట్టిన సర్వే జోరుగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేయనుంది. మొత్తం గరిష్టంగా 4.50 లక్షల ఇళ్లను అందించాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. ఇంటి నిర్మాణానికి కనీసం 400 చదరపు అడుగుల స్థలం ఉండాలి. ఆ ప్రకారం నమూనాతో ప్రతి మండల కేంద్రంలో ఓ ఇట్లు నిర్మించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నమూనా ప్రకారం ఇల్లు ఏ విధంగా ఉంటుందో లబ్దిదారులు పరిశీలించి, నిర్మించుకోడానికి వీలుంటుందని సర్కార్ భావిస్తోంది. ఖచ్చితంగా ఇంటిని ఇలానే నిర్మించుకోవాలనేది ఏమీ లేదు. అయితే పేదలు ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షల డబ్బుతోనే ఇల్లు నిర్మించుకునేందుకు ఈ నమూనా ఉపయోగపడుతుంది. 400 చదరవు అడుగుల కంటే అధికంగా స్థలం ఉన్నవారు సర్కార్ ఇచ్చే డబ్బుతో పాటు అదనంగా ఖర్చు చేసి, తమకు నచ్చినట్లు ఇళ్లు నిర్మించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణంలో రెండు గదులు, వంటగది, బాత్రూం మాత్రం కచ్చితంగా ఉండాలని అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం దరఖాస్తుదారుల వివరాల సేకరణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.





## కొండా సురేఖను క్యాబినెట్ నుంచి భర్తరఫ్ చేయాలి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గీసుకొండలోని గోశాలకు నిబంధనలకు విరుద్ధంగా భూములు కేటాయించమని సిఫార్సు చేసినందుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, లేకుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమెను మంత్రి పదివి నుంచి తొలగించాలని బీజేపీ వరంగల్ జిల్లా నేతలు డిమాండ్ చేశారు. గవర్నర్ చొరవ తీసుకొని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. ఈ విషయంపై ముఖ్య మంత్రికి, గవర్నర్లకు బీజేపీ నాయకులు పోస్ట్ కార్డులు రాసి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకుల రఘునరెడ్డి, గడ్డల కుమార్ యాదవ్, పార్థ ఆనంద్, కోమాకుల నాగరాజు, కట్టర్ సతీష్, కందుకూరి శ్రీనివాస్, నోముల రతన్, మడిపల్లి నాగరాజు గౌడ్, గాదె భిక్షపతి, అల్లి అజయ్, అడపు అనిల్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మేకల కుమార్




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని కంటాయపాలెం గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాల్లే అంజయ్య సునీత కుమారుడు బాల్లే భరత్ ప్రవళికల విహావా వేడుకలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ మాజీ కార్యదర్శి మందపూరి చంద్రమౌళి, గ్రామ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గంగదారి యాకాంబరం, మాజీ వార్డ్ మెంబర్ వేర్పుల మహేందర్, పస్తం కృష్ణ, పానుగంటి మధుకర్ రెడ్డి, ఎండీ షరీఫ్, బండి శేఖర్, పల్లె సురేష్, బాల్య శ్రీనివాస్, నాల్లం బాలరాజు, మందపూరి ప్రశాంత్, బోర శ్రీకాంత్, చిలక సుదీప్, సలావుద్దీన్, నాల్లం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి మల్లన్న జాతరపై సమీక్ష



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** డిసెంబర్ 29న నిర్వహించనున్న శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి కల్యాణం, 19 జనవరి 2025 నుంచి నిర్వహించనున్న కొమురవెల్లి మల్లన్న జాతర ఏర్పాట్లపై అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ సెక్రటేరియట్ లో తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, సిద్దిపేట ఆర్డీవో, కొమురవెల్లి ఆలయ ఏఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భూముల సర్వేపై కలెక్టర్ సమీక్ష



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ఇనుపరాతి గుట్ట పరిధిలో ఫారెస్ట్, పట్టా భూముల సర్వేపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న ఫారెస్ట్, పట్టాదారు భూముల సర్వే ఎంతవరకు వచ్చిందనే వివరాలను సర్వే, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఎఫ్ఓ లావణ్య, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, కుడా పీఓ అజిత్ రెడ్డి, ఫారెస్ట్, సర్వే, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గడ్డి మందు ఘటనపై చర్యలేవి?

### బీఎస్పీ పాలకుర్తి అధ్యక్షుడు ప్రసాద్



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** మండలంలోని చర్లపాలెం గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థి వాటర్ బాటిల్ లో పురుగుల మందు కలిపిన ఘటనపై చర్యలేవని బహుజన సమాజ్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షులు ఈదునూరి ప్రసాద్ ప్రశ్నించారు. గత ఐదు రోజుల క్రితం చర్లపాలెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి మధ్యాహ్న భోజనం చేసేటప్పుడు తన వాటర్ బాటిల్ లో ఎవరో తెలియని వ్యక్తి గడ్డి మందు కలపడం జరిగింది. దీన్ని గమనించిన విద్యార్థి ఆ వాటర్ ని పారపోశాడు. అయితే ఈ సంఘటన జరిగి ఐదు రోజులు కావస్తున్నా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు, స్థానిక హాస్టల్ వార్డెన్ ఏలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా విషయాన్ని పక్కదోవ పట్టించే విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవడడంతోపాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీకాంత్, నాయకులు సంపత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తా

### మాజీ ఎమ్మెల్సీ కొండా కొండా మురళి



**వరంగల్ వాయిస్, రాంనగర్ :** కొండా దంపతుల క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు వరుసగా రెండో రోజు ప్రజల నుంచి విజ్ఞప్తులను వినతులను స్వీకరిస్తు ప్రజల సమస్యలను సావధానంగా వింటూ సంబంధిత శాఖల అధికారులతో అప్పటికప్పుడే ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ప్రజలు అవసరార్థలు పలుమార్లు అధికారులు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనంత త్వరగా పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని కొండా మురళీధర్ రావు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా కొండా దంపతులు అందుబాటులో ఉంటారని, ఏ సమస్యలున్నా ప్రజలు ఎలాంటి పైరవీలు చేయకుండా నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చునని కార్యకర్తలకు, నాయకులకు ఏ ఆపద వచ్చిన కొండా దంపతులు కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు వారికి భరోసానిచ్చారు.

## వివాహ మహోత్సవంలో ఎర్రబెల్లి స్వర్ణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉర్సు గుట్టలో గల ఆకుతోట కన్వెన్షన్ లో మాజీ ఎంపీపీ కందగట్ల నరహరి కుమారుడి వివాహ మహోత్సవానికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సంగెం మండల పార్టీ అధ్యక్షుడు చోల్లేటి మాధవ రెడ్డి, లీగల్ సెల్ రావుల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- భిన్న వ్యక్తిత్వాల రూపం
- చక్కని చిరునవ్వుతో పలకరింపు
- చూడగానే ఆకట్టుకునే వ్యవహార శైలి

వరంగల్ జిల్లా సహకార శాఖ అధికారి మాటేటి నీరజ క్రమశిక్షణకు మారుపేరు. కార్యదీక్షత ఆమె సొంతం. ప్రభుత్వ నిబంధనలను తూ.చ తప్పకుండా పాటిస్తారు. తలపెట్టిన పనిని ఆరు నూరైనా పూర్తి చేస్తారు. ఎవరితోనైనా ఆమె ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడుతారు. చక్కని చిరునవ్వుతో చూడగానే ఆకట్టుకునే వ్యవహార శైలి ఆమెకు పెట్టని ఆభరణాలు. జిల్లా సహకార శాఖ అధికారిగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ శాఖ పరంగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. భిన్న వ్యక్తిత్వాల రూపం కలిగిన ఆమె సౌమ్యంగా కనిపిస్తారు. కానీ, పనుల విషయంలో మాత్రం కఠినంగానే వ్యవహరిస్తారు. స్వతంత్ర భావాలు కలిగిన ఆమె మహిళా లోకంలో మణిహారంగా వెలుగొందుతున్నారు.








# మహిళా మణిహారం
# మాటేటి నీరజ

గడ్డం కేశవమూర్తి





## కుటుంబ నేపథ్యం.. విద్యాభ్యాసం..

వరంగల్ నగరంలోని కరీమాబాదులో 1966 జూన్ 7న మాటేటి రుకునమ్మ–నరసింహారావు దంపతులకు నీరజ జన్మించారు. తల్లి గృహిణి కాగా తండ్రి వేలేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్యానల్ గ్రేట్ హెడ్మాస్టర్ గా పనిచేశారు. 1986 మార్చి 17న నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ ఇంజనీర్ గాలిపల్లి రవీందర్ ను ఆమె వివాహం చేసుకున్నారు. ఆయన ఇరిగేషన్ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూతురు సింధుజ ఫార్మసీలో ఎంఎస్ పూర్తి చేశారు. కుమారుడు మానస్ చెన్నై ఐఐటిలో బీటెక్ పూర్తి చేశారు. వీరిద్దరి వివాహాలు జరిపించారు. వీరికి ఇద్దరు మనుమరాల్లు మనుమడు ఉన్నారు. నీరజ ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు దామెర ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు వరంగల్ కృష్ణ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభ్యసించారు. మహబూబాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ, వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఎస్సీ (బీజెడ్ సీ) పూర్తి చేశారు. వివాహానంతరం ఎంఏ (తెలుగు), హెచ్ డీసీఎం కోర్సులను అభ్యసించారు. ప్రతి క్లాసులో నీరజ ప్రధమంగా నిలిచారు. తండ్రి నరసింహారావు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేయడం వల్ల చిన్నప్పటి నుంచే ఆమె చదువులో ముందున్నారు. తల్లి రుకునమ్మ, భర్త రవీందర్ ప్రోత్సాహంతో నీరజ వంటింటికే పరిమితం కాకుండా బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకున్నారు.

## ఉద్యోగ ప్రస్థానం..

1999లో గ్రూప్ టూ సర్వీస్ పోటీ పరీక్షల్లో నీరజ మంచిర్యాంకు సాధించి జిల్లా సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉద్యోగం సాధించారు. శిక్షణ అనంతరం 2005లో హనుమకొండ జిల్లాలో ప్రథమ పోస్టింగ్ పొందారు. కొంతకాలం జనగామలో పనిచేశారు. 2017లో గ్రూప్ వన్ అధికారిగా పదోన్నతి పొంది వరంగల్ జిల్లా సహకారశాఖ అధికారిగా సేవలందించారు. అనంతరం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో ఓఎస్ డిగా, వరంగల్ జిల్లా ఆడిట్ అధికారిగా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వర్తించారు. నీరజ ప్రభుత్వ సర్వీస్ అంతా కూడా వరంగల్, హనుమకొండ పరిధిలోనే కొనసాగింది. 2024 ఆగస్టు 20వ తేదీ నుంచి వరంగల్ జిల్లా సహకార శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. అలాగే శాఖ పరంగా ప్రజలకు లభించే వసతి సౌకర్యాలతో పాటు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. సహకార శాఖ బలోపేతానికి మాటేటి నీరజ కృషి చేస్తున్నారు. ముఖ్యంగా సభలు, సమావేశాల్లో ఆమె పాల్గొంటూ మోటివేషన్ ప్రసంగాలు చేస్తున్నారు. ఆధ్యాత్మికతకు సంబంధించిన పుస్తకాలు చదివే నీరజ యోగ, మెడిటేషన్ చేస్తారు. జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్ లో మహిళా ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ గా పని చేస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నారు. అలాగే తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘంలో కూడా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. విభిన్న రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న నీరజను అనేక అవార్డులు వరించాయి. 1981లో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి యోగ్యతా పత్రం, 2003లో యూజీసీ జాతీయ సదస్సులో పాల్గొని కాకతీయ యూనివర్సిటీ నుంచి ధ్రువీకరణ పత్రం పొందారు. 2013లో వరంగల్ కలెక్టర్ వాకాటి కరుణ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. 2024 డిసెంబర్ 10న నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అండ్ సివిల్ జస్టిస్ సంస్థ నుంచి భారత్ సేవా రత్న అవార్డును స్వీకరించారు. అలాగే పలు స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి కూడా సత్కారాలు పొందారు.

## కాలానుగుణంగా మారాలి.. : మాటేటి నీరజ

మనసులో ఆరాటం జ్వలిస్తే తప్ప కార్యసాధన చేయలేం. సమయోచితంగా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తే తప్ప అనుకున్నది సాధించలేం. అసాధారణ ప్రతిభ, ఉనికి తెలియని ఎక్కడో ఓ బిందువు వద్ద నిలిచిపోతే దానికి అర్థమే ఉండదు. ఎవరి స్థాయిలో వారు దూసుకుపోయినప్పుడే దానికి సార్థకత. ఈ మాటల్ని తన మార్గంగా మలుచుకున్న వరంగల్ జిల్లా సహకార శాఖ అధికారి మాటేటి నీరజ అదుపుతప్పిన సహకార శాఖ ప్రగతిని ఆర్డర్ లో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ముక్కుసూటి మనిషిగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె నిష్కర్షకు.. నిర్భీతికి, నిర్ణయాలకు పర్యాయపదంగా నిలుస్తున్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పనిలో ప్రత్యేకత చూపితేనే సక్సెస్ అవుతారంటారామె. ఉద్యోగపరంగా స్ట్రాంగ్ గా ఉంటేనే ఎవరైనా మన మాట వింటారంటారు.. అయితే ప్రతి ఉద్యోగి కాలానుగుణంగా మారాలంటారు మాటెటి నీరజ.









# ర్యాగింగ్ ను నిర్మూలించాలి

- విద్యార్థుల డ్రాప్ ఔట్ తగ్గించాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా పరిధిలోని కళాశాలల్లో ర్యాగింగ్ ను నిర్మూలించడంతోపాటు జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాజరు, మానసిక స్థైర్యం తదితర అంశాలను కళాశాల యాజమాన్యాలు నిరంతరం సమీక్షిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం పేరెంట్స్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అన్ని కళాశాలల్లో ఆంటీ-డ్రగ్ కమిటీలు, టెలీమానస్, పరీక్ష ఫీజుల చెల్లింపు, అడ్మిషన్లు, డ్రాపవుట్ విద్యార్థుల హాజరు మెరుగు పర్చుకోవడంపై చర్యలు, తదితర అంశాలపై నివేదికలు సేకరించాలని సూచించారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలు కావడం ద్వారా చదువుమీద దృష్టి పెట్టడంలేదన్నారు. రానున్న వార్షిక పరీక్షల్లో అధ్యాపకులు ప్రణాళిక బద్ధంగా బోధన చేసి 100 శాతం ఉత్తీర్ణత ఫలితాలను సాధించాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులతో పాటు, వారు కూడా ఉత్తీర్ణులు అయ్యేందుకు ప్రణాళికతో పని చేయాలని ఆదేశించారు. కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ర్యాగింగ్ అనేది పరిచయం పెంచుకునేలా ఉండాలి విద్యార్థులకు మద్దతుగా భావించే గౌరవం, సానుభూతి, కలుపుకుని పోయే స్వభావ సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, మమునూర్ ఏసీపీ తిరుపతి, డీఆర్వో విజయ లక్ష్మి, ఆర్అండ్ బీ ఈఈ జితేందర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్, డీఎంహెచ్ఓ సాంబశివరావు, జిల్లా మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ మోహన్ దాస్, ప్రభుత్వరంగ కళాశాలల రీజినల్ కో-ఆర్డినేటర్లు, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోదాముల తనిఖీ..

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాముల్లో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల ( ఈవీఎంల)ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణితో కలసి గురువారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ తనిఖీలో నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టీడీపీ నుంచి శ్యామ్ సుందర్, ఏఐఎంఐఎం నుంచి ఫైజోద్దీన్, బీజేపీ నుంచి హరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# కళ్లుండి చూడలేని కబోది కేటీఆర్

## టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ఏడాది పాలనలో విజయవంతంగా ముందుకెళుతుంటే.. ఓర్వలేకనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాహుల్ గాంధీకి లేఖ రాశాడని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. కళ్లుండి చూడలేని కబోది కేటీఆర్ అంటూ దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటి అమలు కావడం లేదంటూ కేటీఆర్ రాహుల్ గాంధీకి ఎలా లేఖ రాస్తారంటూ సుధాకర్ గౌడ్ ప్రశ్నించారు. ఈ విషయాన్ని కేటీఆర్ నిరూపించగలరా అని నిలదీశారు. ఉచిత బస్సు ప్రయాణంలో 80 కోట్ల మంది మహిళలు, ఉచిత విద్యుత్తు కింద 50 లక్షల మంది గృహిణులు లబ్ది పొందలేని నిరూపించగలవా కేటీఆర్ అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లున్నదని ఎద్దేవా చేశారు. తెలంగాణాలో ఫిరాయింపులకు పితామహుడే కేసీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్ల కేటీఆర్ అవహేళనగా మాట్లాడటాన్ని బండి తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ భాష మార్చుకపోతే న్యాయపరంగా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు.



# రెడ్ క్రాస్ లో ఉచిత కుట్టు శిక్షణ

## పూర్తి చేసుకున్న 50 మందికి సర్టిఫికెట్ల పంపిణీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణను పూర్తి చేసుకున్న 50 మంది స్టూడెంట్స్ కి సర్టిఫికెట్లను చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట్ నారాయణలు గౌడ్ లు పంపిణీ చేశారు. గురువారం వైస్ చైర్మన్ ఎది వెంకట్ నారాయణ గౌడ్ పుట్టినరోజు పురస్కరించుకొని పాలకవర్గం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ పి.విజయ్ చందర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కుట్టు శిక్షణ ద్వారా ఎంతో మందికి శిక్షణను అందించి వారి ఉపాధి కోసం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ పాలకవర్గం కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలకవర్గ సభ్యులు జయశ్రీ, పుల్లూరి వేణుగోపాల్, టైలరింగ్ టీచర్ కంకణాల విజయ, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే నా ఎజెండా

- విద్య, వైద్య రంగానికి పెద్దపీట
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత నిస్తుందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. చిల్పూర్ మండలం మల్కాపూర్ పీహెచ్ సీకి మంజూరైన 108 సర్వీస్ అంబులెన్స్ ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర సర్కార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 681 మంది వైద్యులను నియమించిందని వెల్లడించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పలుమార్లు కలిసి వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేసుకోవడం జరిగిందని తెలిపారు. అందుకు ఆర్టీసీ ఆధీనంలో ఉన్న నాలుగు ఎకరాల భూమిని 100 పడకల ఆసుపత్రికి కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరగా వారు మంజూరు ఇచ్చినట్లు వెల్లడించారు. త్వరలో రూ.45 కోట్లతో ఆసుపత్రి భవనాన్నినిర్మించుకోబోతున్నామని తెలియజేశారు. వచ్చే నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా లింగాల గణపూర్ మండల పరిధిలోని ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు గాను నూతనంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్ సేవలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్, వైద్య అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# అన్న ప్రసాద వితరణ

**వరంగల్ వాయిస్, జనగామ :** లయన్స్ క్లబ్ జనగామ బి భాయిజ్ సభ్యుడు యాంసాని రోషన్-సంధ్య దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రెస్టెన్ ప్రాంగణం సమీపంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ డి.శివశంకర్ మార్గదర్శనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కన్న శ్రీనివాస్, ఎల్.కిషోర్, బాలకృష్ణ, కె.అనిల్, ప్రణిత తదితరులు పాల్గొన్నారు.

# 14న మెగా లోక్ అదాలత్

## వరంగల్ పోలీస్ కమిషనర్ కిషోర్ ఝా

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో కోరారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని ఆయన సూచించారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. తమ కేసుల్లో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులను సంప్రదించాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది పోలీస్ కమిషనర్ తెలిపారు.



# ఆపదలో ఉన్న స్నేహితుడికి.. బాల్యమిత్రుల అండ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ కొత్తూరు చెందిన మహమ్మద్ జావేద్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్య వారి తల్లి క్యాన్సర్ వ్యాధిన పడటంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో ఆటోకు నెలవారీగా కట్టాల్సిన కిస్తీలు కట్టకపోవడంతో ఫైనాన్స్ సిబ్బంది ఆటోను తీసుకెళ్లారు. దీంతో చలించిన 1985 ఎస్సెస్సీ ఏ-సెక్షన్ బ్యాచ్ మర్కజి స్నేహితులు అందరూ కలిసి స్నేహితుడి కోసం సహాయం చేసి ఆటో కిస్తీలు కట్టి వారి ఆటోను విడిపించి వారి అమ్మకు కావాల్సిన మందులతౌనాటె నగదు సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు గోకారపు శ్యామ్, బింగి సురేష్, రాంబాబు, శ్రీనివాస్, మధు, అజిత్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com